# విశాలాంధ్ర గోదావరి జిల్లా
## ఏలూరు, పశ్చిమగోదావరి

### అన్నవరం 5వ వార్డు వైకాపా వశం

**విశాలాంధ్ర-నూజివీడు :** మండలంలోని అన్నవరం గ్రామ పంచాయతీలో జరిగిన 5వవార్డు ఉప ఎన్నికలో వైకాపా మద్దతుదారు 53 ఓట్లతో విజయం సాధించారు. ఈ వార్డు గతంలోనూ వైకాపా మద్దతుదారే విజయం సాధించగా ఆ వార్డు సభ్యుడు మృతి చెందగా ఇక్కడ ఉప ఎన్నికను నిర్వహించారు. 216 ఓట్లు నమోదు కాగా వైకాపా సభ్యునికి 131 ఓట్లు రాగా అతని ప్రత్యర్థి తెలుగుదేశం మద్దతుదారుకి 78 ఓట్లు పోలయ్యాయి. 6 చెల్లని ఓట్లుగాను,1 నోటాకు పోలయ్యాయి.

### తేతలిలో టీడీపీ బలపరిచిన అభ్యర్థి విజయం

**విశాలాంధ్ర-తణుకు:** నియోజవర్గంలోని తణుకు మండలం తేతలి గ్రామంలోని 8వ వార్డుకు హెూరా హెూరీగా జరిగిన ఎన్నికలలో టిడిపి బలపరచిన కోట దుర్గారావు 9 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు . ఈ సందర్భంగా తెదేపా తణుకు నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ గెలుపొందిన అభ్యర్థికి, విజయానికి కృషి చేసిన తేతలి తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం తేతలి తెలుగుదేశం పార్టీ గ్రామ నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

### కాట్రేనిపాడు10వ వార్డులో గెలిచిన రాజ్యలక్ష్మి

**విశాలాంధ్ర-ముసునూరు:** మండలంలోని ముసునూరు 11వ వార్డులో టీడిపి అభ్యర్థి కలపాల నలోమియాకు 115 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి 161కు ఓట్లు రావడంతో 46 ఓట్లు మెజరిటీతో గెలుపొందారు. కాట్రేనిపాడు గ్రామ పంచాయతీలో 10వ వార్డు వైసిపి అభ్యర్థి పేరిచర్ల రంగారావుకు 97 ఓట్లు రాగా, టిడిపి అభ్యర్థి కాజా రాజ్యలక్ష్మి 175 ఓట్లు రావడంతో 78 ఓట్లు మెజరిటీతో గెలుపొందారు. వేల్పుచర్లలో వైసీపీ అభ్యర్థి ఏకగ్రీవం కావడంతో ఎన్నికలు నిర్వహించలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కోటగిరి మురళి తెలిపారు.

### గణపవరం 12వ వార్డు మెంబర్‌గా దుర్గ

**విశాలాంధ్ర - గణపవరం:** గణపవరం గ్రామ పంచాయతీ పరిధిలో 12వ వార్డుకు శనివారం ఎన్నికలు జరిగాయి. తెలుగుదేశం, వైఎస్ఆర్ పార్టీలు బలపరిచిన అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 12వ వార్డులో మొత్తం 691 ఓట్లు ఉండగా రెండు పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి గొర్రెలు బాలయ్య తెలిపారు. మొత్తం 513 ఓట్లు పోల్ అయ్యాయని వైయస్సార్ పార్టీకి 277 తెలుగుదేశం పార్టీ అభ్యర్థి 232 ఓట్లు వచ్చాయని, వైయస్సార్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తాడిదుర్గ 45 ఓట్లు మెజార్టీతో గెలుపొందారని ఆయన తెలిపారు.

### పంచాయతీ ఎన్నికల్లో వైసీపీదే గెలుపు

**విశాలాంధ్ర-ద్వారకాతిరుమల :** వార్డు మెంబర్ల ఉప ఎన్నికల్లో ఊహించని విధంగా వైసీపీ పార్టీ మద్దతు దారులు విజయం సాధించారు. మండల కేంద్రమైన ద్వారకాతిరుమల 8వార్డు, గుణ్ణంపల్లి గ్రామంలోని 4వార్డుకి శనివారం ఉప ఎన్నికలు జరిగాయి. ద్వారకాతిరుమల 8వవార్డులో వైసీపి మద్దతుదారు నడికట్టి సీతారామాంజనేయులుకు తన సమీప అభ్యర్థి టీడీపీ మద్దతుదారుడు పెద్దింటి నాగేశ్వరరావు మీద 73ఓట్ల తేడాతో గెలిచారు. గుణ్ణంపల్లి 4వవార్డులో జరిగిన ఉప ఎన్నికలో వైసీపి బలపరచిన ముసల నాగవేణి తన సమీప తెదేపా అభ్యర్థి కసిరెడ్డి శ్రీదేవిపై 36ఓట్ల తేడాతో విజయం సాధించారు.

### పోలసానిపల్లి పంచాయతీ వార్డు ఉప ఎన్నికలలో టీడీపీ బలపరిచిన అభ్యర్థి విజయం

**విశాలాంధ్ర-భీమడోలు:** పోలసానిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని 12వ వార్డు సభ్యుని ఎంపికకు శనివారం నిర్వహించిన ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుతో పోటీ చేసిన పాముల ధనలక్ష్మి 117 ఓట్లు సాధించి పది ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వారి సమీప ప్రత్యర్థి వైసీపీ మద్దతుతో పోటీ చేసిన బొద్దాని ప్రసాద్ కు 107 ఓట్లు వచ్చాయి. వీరితోపాటు జనసేన పార్టీ మద్దతుతో పోటీ చేసిన గారపాటి రాజు 49 ఓట్లు సాధించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం నుండి టీడీపీ అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించి విజయోత్సవం చేసారు.

### ఉప ఎన్నికల్లో నాగమణి, రాజు విజయం

**విశాలాంధ్ర-ఉంగుటూరు:** ఉంగుటూరు మండలం కాకర్లమూడి గ్రామపంచాయతీ ఉప ఎన్నికల్లో ఒకటో వార్డు సభ్యురాలుగా రాయి నాగమణి, ఐదో వార్డు సభ్యులుగా గొడే రాజు విజయం సాధించారు. వారికి ఎన్నికల అధికారి శనివారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఉంగుటూరు తహసిల్దార్ ఏవి రమణారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఆంజనేయ బాబు, ఈవోపీఆర్డి షేక్ సంసిద్దిన్ పర్యవేక్షించారు. గ్రామంలో ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

### వైకాపా బలపరిచిన మడకం ధర్మరాజు గెలుపు

**విశాలాంధ్ర - జీలుగుమిల్లి :** జీలుగుమిల్లి పంచాయతీలో ఆరో వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో వైకాపా బలపరిచిన అభ్యర్థి మడకం ధర్మరాజు 44 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి రామానుజన్ తెలిపారు. శనివారం జీలుగుమిల్లి జడ్పీ హైస్కూల్లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. 209 ఓట్ల పోలవ్వగా వైకాపా బలపరిచిన అభ్యర్థి మడకం ధర్మరాజుకి 118 ఓట్లు టిడిపి బలపరిచిన అభ్యర్థికి 74 ఓట్లు, సిపిఎం బలపరిచిన అభ్యర్థికి 9 ఓట్లు నోటాకి 5 వచ్చినట్లు ఆయన తెలిపారు.

### నిండ్రకొలను వార్డు మెంబర్‌గా జనసేన అభ్యర్థి గెలుపు

**విశాలాంధ్ర - నిడమర్రు:** నిడమర్రు మండలం పెద నిండ్రకొలనులో గ్రామ పంచాయతీ పరిధిలో తొమ్మిదో వార్డుకు శనివారం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో జనసేన అభ్యర్థి గంధం వెంకట పుల్లారావు 32 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికల అధికారుల నుండి పుల్లారావు ధృవీకరణ పత్రం అందుకున్నారు.

### టిడిపి, జనసేన అభ్యర్థి గెలుపు

**విశాలాంధ్ర - కలిదిండి:** కలిదిండి పంచాయతీ 14వ వార్డు ఎన్నికలలో టిడిపి జనసేన బలపరిచిన అభ్యర్థి గెలుపొందారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహించగా 14వ వార్డుకు టిడిపి జనసేన బలపరిచిన అభ్యర్థి పువ్వుల భోగేశ్వరమ్మ 50 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 620 ఓట్లకు 443 ఓట్లు పోలయ్యాయి. గెలుపొందిన భోగేశ్వరమ్మను టిడిపి, జనసేన పార్టీ నాయకులు పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు.

### వైసీపీ మార్టేరు అభివృద్ధి సమన్వయ కమిటీ విజయం

**విశాలాంధ్ర-పెనుమంట్ర:** ఆచంట నియోజవర్గంలో ప్రధాన కేంద్రమైన మార్టేరు పంచాయతీ 14వ వార్డు ఎన్నికలలో ఇద్దరు వైసీపీ అభ్యర్థులు పోటీ పడడం విదితమే. శనివారం జరిగిన ఎలక్షన్ లో 356 ఓట్లు పోలవగా వైసిపి మార్టేరు అభివృద్ధి సమన్వయ కమిటీ అభ్యర్థిని కప్పల అనంతలక్ష్మి 246 ఓట్లు రాగా 138 ఓట్ల మెజార్టీతో విజయకేతనం ఎగరవేశారు.

### మత్స్యపురిలో వైసీపీ అభ్యర్థి గెలుపు

**విశాలాంధ్ర-వీరవాసరం:** మండలంలోని మత్స్యపురి ఒకటో వార్డుకు శనివారం జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి కారేపల్లి విజయలక్ష్మి 160 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఒకటవ వార్డు పరిధిలో మొత్తం 292 ఓటర్లు ఉండగా ఉప ఎన్నికల్లో 234 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో వైసిపి అభ్యర్థికి 197 ఓట్లు రాగా, టిడిపి,జనసేన ఉమ్మడి అభ్యర్థికి 37 ఓట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

### వైసీపీ అభ్యర్థి సుగుణబాబు గెలుపు

**విశాలాంధ్రం - ముదినేపల్లి :** ముదినేపల్లి మండలంలోని వణుదుర్రు సర్పంచ్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సరళిని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ స్వయంగా పర్యవేక్షించారు. వణుదుర్రు గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికకు కొత్తపల్లిలో రెండు , వణుదుర్రులో రెండు పోలింగ్ కేంద్రాలలో ఓట్ల ప్రక్రియ పూర్తికాగా వణుదుర్రులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో లెక్కింపు జరిగింది. 1346 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ జరిగిన ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన చిన్నం సుగుణ బాబు 444 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

# పోలింగ్ ప్రశాంతం

- పంచాయతీరాజ్, రెవిన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో 33 కేంద్రాలలో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తి
- 81.71 శాతం పోలింగు నమోదు

**విశాలాంధ్ర-ఏలూరు:** చిన్న చిన్న సంఘటనలు మినహా జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సర్పంచ్, వార్డు సభ్యులకుగాను 51 ఖాళీలకు ఎన్నికలు జరగవలసి ఉండగా ఏకగ్రీవాలు, సింగిల్ నామినేషన్ దాఖలా వలన 33 పోలింగ్ కేంద్రాలలో 03 సర్పంచులకు, 21 వార్డు సభ్యులకు అధికారులు పోలింగ్ నిర్వహించారు. సమస్యత్మక పోలింగ్ కేంద్రాలతో ముంపు పొంచి ఉండచ్చని గ్రహించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ముందు చూపుతో అధికారు లను అప్రమత్తం చేసి సెన్సేటివ్, హైపర్ సెన్సేటివ్ పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ పహార పెంచాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించడంతో పాటు, పోలింగ్ కేంద్రాల వద్ద వీడియోగ్రాఫి ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు. ముందుగా ఊహించి నట్లే పెదపాడు మండలం వీరమ్మకుంటలో ఇరు అభ్యర్థుల వర్గాల వారు నువ్వెం తంటే నువ్వెంతని బాహాబాహికి దిగినా పోలీస్ రంగప్రవేశంతో సమస్య సద్దు మణిగింది. మొత్తానికి జిల్లాలో గ్రామీణ ప్రాంతం ఓటర్లు విజ్ఞత ప్రదర్శించి 81.71 శాతం భారీ పోలింగ్ చెయ్యగా వయసుతో సంబంధం లేకుండా ఉత్సా హంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు.

### ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఉపసంహరించుకోవాలి

**- సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య**

**విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం :** ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో పాటు నిర్వాసితుల సమస్యలను వెంటనే

పరిష్కరించాలని, తదితర ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని రక్షించండి- దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాత బస్సుయాత్ర గోడ పత్రికలను శనివారం జంగారెడ్డిగూడెం సిపిఐ మండల సమితి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయ వ్యవస్థలో మతోన్మాదాన్ని జొప్పించి దుష్ట సంప్రదాయాలను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. అనేక రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోసి గవర్నర్ ద్వారా తమ పార్టీ ప్రభుత్వాలను అప్రజాస్వామికంగా ఏర్పాటు చేస్తుందని ఆయన విమర్శించారు. ఎన్నో త్యాగాల ద్వారా సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, జీవిత బీమా, బిఎస్ఎన్ఎల్, ఆయిల్, బొగ్గు, స్టీల్, విమానయాన సర్వీసులు , రైల్వేలు, రక్షణ ఉత్పత్తులు, అంతరిక్ష పరిశోధన వంటి వాటిని కార్పొరేట్ శక్తులుకు కారు చౌకగా అప్పగిస్తున్నారని ఆయన విమర్శించారు. అన్ని రకాల పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ , నిత్యాసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి ప్రజలను అవస్థల పాలు చేశారని ఆయన విమర్శించారు. సంక్షేమ పథకాల పేరిట ప్రజలకు ఇచ్చేది గోరంత దోచేది కొండంతగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు,సిపిఐ జంగారెడ్డి గూడెం మండల కార్యదర్శి జెవి రమణరాజు, మండల కమిటీ సభ్యులు తాళ్లూరు నాగరాజు, చిలంతరాజుల శ్రీను, దొంతు రాంపండు, హనుమంతు, సీనయ్య, డి. రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

### విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

**విశాలాంధ్ర-ఏలూరు:** విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించి ఆధార్ నమోదు చేస్తున్నామని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి రమణ చెప్పారు. ఏలూరు తంగెళ్లమూడినిలోని మిషనరీస్ అఫ్ చారిటీ, మదర్ తెరెసా డిజెబిల్డ్ చిల్డ్రన్ ఆశ్రమ లో శనివారం ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసిన 40 మందికి పైగా విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు ఆధార్ నమోదు చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిగా అమలయ్యేందుకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది సహకారంతో విభిన్న ప్రతిభావంతులకు ఆధార్ నమోదు చేసేందుకు ప్రత్యేక సంచార ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి, ఆధార్ నమోదుతో పాటు , ఆధార్ కు మొబైల్ ఫోన్ నెంబర్ లింక్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్ జిల్లా కోఆర్డినేటర్ రవి, సిబ్బంది వెంకటేశ్వరరావు, చైతన్య, ఆశ్రమ ఇన్‌చార్జి బ్రదర్ మరియనస్తి థియో,, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పద్మావతి, ప్రభృతులు పాల్గొన్నారు.

### లయన్స్ క్వెస్ట్ పాఠ్యాంశాలు విద్యార్థులకు ఉపయోగకరం

**విశాలాంధ్ర -భీమవరం :** విద్యార్థులలో ఆత్మ నిబ్బరం , సమస్యలను ఎదుర్కొనే చాకచక్యం ,తల్లిదండ్రులు ఎడల బాధ్యత ,చెడు వ్యసనాలకు దూరంగా ఉండే విధం గా లయన్స్ 'క్వెస్ట్ ' పాఠాలను ప్రభుత్వం పాఠశాలలో భోదించే విధానం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం అని శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ తెలిపారు. శనివారం ప్రభుత్వ పాఠశాలలలో బోధించే విధానం కోసం లయన్స్ మల్టిపుల్ ఛైర్పర్సన్, శాసన మండలి సభ్యులు వంక రవీంద్ర నాథ్, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతితో భీమవరం కలెక్టర్ ఆఫీసులో చర్చలు జరిపారు. లయన్స్ క్లబ్ తయారుచేసిన పాఠ్యాం శం పరిశీలించి, ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, వత్తిడి ని తట్టుకొనే మనస్తత్వం కలుగుతుందని కలెక్టర్ అన్నారు. ఈ చర్చా కార్యక్రమంలో జిల్లా లయన్స్ గవర్నర్ గట్టి మాణిక్యాల రావు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు సి హెచ్ కృష్ణం రాజు, డా.బాబ్జీ, జిల్లా విద్యా శాఖ అధికారి వెంకట రమణ పాల్గొన్నారు.


**నోటీసు**

**మైలవరం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు మైలవరం**

ఐ.ఎ.నెం : **33/2023** ఇన్

ఓ.యస్.నెం :**5/2023**

బిట్వీన్ :

**మద్దిరాల కాత్యాయని కుమార్** - వాది

మరియు

**1) జువ్వనబోయిన వాణి భర్త ముత్తయ్య** హిందూ 48సం॥ డిపో మేనేజర్ ఏ.పి.యస్.ఆర్.టీ.సీ ఏలూరు.

**2) జువ్వన బోయిన సాయిమణికంఠ తండ్రి లేటు ముత్తయ్య** హిందూ వయస్సు 12సం॥లు **(మైనర్ అయినందున సంరక్షకురాలు తల్లి జువ్వన బోయిన వాణి)** - **ప్రతివాదులు**

పై నెంబరు దావాలో మీరు ప్రతివాదులై యున్నారు. కావున కోర్టు వాయిదా **ది.19-10-2023**న మీరు గాని మీ తరపున లాయరు గారి ద్వారా గాని హాజరై మీ తరపున వాదనలు విని పించవలసిందిగా కోర్టువారు కోరియున్నారు. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును. కావున తెలియజేయడమైనది.

వాయిదా తేది : **19-10-2023**

// బై కోర్టు ఆర్డర్//

**పి.వి.శేషగిరిరావు, పి.పద్మశ్రీ,**
న్యాయవాదులు మైలవరం
సెల్ : 98482111112



**ప్రకటన**

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా **మేకా ఫణీంద్రర్ (45) సంవత్సరాలు తండ్రి మేకా (లేటు) సత్యనారాయణ** నివాసం డోరు నెంబసర్ 24సి 6/5-3 చేతన్య పూరి కాలనీ రామచంద్రరావు పేట ఏలూరు ఏలూరు జిల్లా తెలియజేయునది ఏమనగా

**31-05-2023** తేదీన మాతల్లి గారు అయిన మేకా సత్యనారాయణ (లేటు) భార్య మేకా **సీతారత్నం** గారి నుండి దఖలు పొందినా దస్తావేజు నెంబరు. **6369/2023 మరియు డాక్యుమెంట్ నెంబరు 1890/1982** లింక్ డాక్యుమెంట్ తీసుకొని ఇంటి నుండీ అమ్మపాలెం సెంటర్ ఫొటోస్టాట్‌కు వెళ్లి ఫొటోస్టాట్ తీసుకొనుటకు దస్తావేజు చూడగా కనబడలేదు చుట్టూ ప్రక్కల వేదికిన దస్తావేజు కనబడలేదు యావత్తు ప్రజలకు తెలియ జేస్తున్నాం. ఎవరికైనా కనబడిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబరుకు **9701843003** కి తెలుపగలరు.

మేకా ఫణీంద్రర్, ఏలూరు
ఏలూరు జిల్లా


### రాష్ట్రాన్ని రక్షించుకుందాం- దేశాన్ని కాపాడుకుందాం

**విశాలాంధ్ర -భీమవరం:** రాష్ట్రాన్ని రక్షించుకుందాం-దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో సీపీఐ విశాఖలో ప్రారంభమైన బస్సు యాత్ర ఈ నెల 22న పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రవేశిస్తున్న సందర్భంగా తణుకులో జరుగనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. భీమవరంలో సీపీఐ బస్సు యాత్ర ప్రచార జాతా కరపత్రాలను శనివారం సిపిఐ, ఎఐటియుసి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్రాన్ని రక్షించుకుందాం-దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో విశాఖ నుంచి సిపిఐ చేపట్టిన బస్సు యాత్రను జిల్లాలో విజయవంతం చేయాలని ఈ సందర్భంగా తణుకులో 22న జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కిలారి మల్లేశ్వరరావు, బంగారు శివ, దుర్గారావు, సాయి, సత్యనారాయణ, నీలాపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ప్రకృతి సేద్యం సిబ్బందికి జీతాలు చెల్లించాలి

**- ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు**

**విశాలాంధ్ర - ఏలూరు:** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రకృతి సేద్యం సిబ్బందికి బకాయి పడ్డ జీతాలు తక్షణం చెల్లించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రకృతి సేద్యం అభివృద్ధి కోసం పనిచేస్తున్న సిబ్బందికి ఆరు నెలలకి ఒకసారి కూడా జీతాలు ఇవ్వలేని పరిస్థితి దాపురించిందని విమర్శించారు. ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ నుంచి ప్రకృతి సాగు ప్రోత్సాహకానికి ప్రత్యేక నిధులు విడుదల అవుతున్నా వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్ళించడం వలన సిబ్బందికి జీతాల సమస్య తలెత్తుతుందని విమర్శించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 450 మంది సిబ్బంది వివిధ హెూదాలలో పని చేస్తున్నారని తెలిపారు. వీరికి రూ.ప్రస్తుతం 44 లక్షల వరకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఉద్యోగులు సకాలంలో జీతాలు అందక రుణాలు చేసుకుంటూ ఆర్థికంగా అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బకాయి పడ్డ 6 నెలల జీతాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు.

### సీపీఐ బస్సు యాత్రను విజయవంతం చేయండి

**విశాలాంధ్ర-పెంటపాడు:** రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు పిలుపు నిచ్చారు. శని వారం సిపిఐ బస్సు యాత్రకు సంబంధించిన గోడపత్రికను సిపిఐ మండల పార్టీ కార్యదర్శి కలింగ లక్ష్మణరావు, రైతు సంఘం నాయకులు బండారు శ్రీనివాసరావు, సిపిఐ మండల సమితి సభ్యులు కొణతాల నాగరాజు, దేవల్లి విజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ విశాఖ నుండి తిరుపతి వరకు బస్సు యాత్ర ఈ నెల 17 నుండి సెప్టెంబర్ 8 వరకు సిపిఐ చేపట్టిందన్నారు. ఈనెల 22 న తణుకు బస్సు యాత్రను పెంటపాడు మండల సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

### బస్సుయాత్ర గోడపత్రిక ఆవిష్కరణ

**విశాలాంధ్ర - కామవరపుకోట :** రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపా డండి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఆగస్టు 17న విశాఖ పట్నంలో ప్రారంభమైన బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ శ్రేణులకు ప్రజా సంఘాలకు సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు పిలుపునిచ్చారు. శనివారం బస్సు యాత్ర గోడపత్రికను సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు జి. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీవీఎస్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే పాలకులు ప్రజా సేవకులు అవ్వాలన్నారు. ఈనెల 23న జంగారెడ్డిగూడెం బస్సు యాత్ర చేరుకుంటుందని జేపీ సెంటర్ లో భారీ బహిరంగ సభ జరుగుతుందని ప్రజలంతా హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కే బుచ్చిబాబు, ఎం దుర్గారావు, ఏమండ్ర స్వామి కే వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

### భర్తే కాలయముడు

**విశాలాంధ్ర-ఆకివీడు :** భర్తే కాలయముడై భార్యను హతమార్చిన సంఘటన శనివారం ఆకివీడులో సంచలనం సృష్టించింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త కర్కసత్వంగా భార్యను చాకుతో పొడిచి కడ తేర్చాడు. ఈ ఘటనలో భార్య వాడపల్లి సంధ్యారాణి(24) భర్త చేతిలో అతి దారుణంగా మృతి చెందింది. ఆకివీడు శివారు దుంపగడప రైల్వే గేట్ వద్ద నివసిస్తున్న ముదునూరి సత్యనారాయణ, పద్మజాలకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె సంధ్యారాణి సమీప ప్రాంతంలోని వాడపల్లి రాంబాబును ప్రేమించి పెళ్లాడింది. రెండేళ్ల క్రితం వీరి వివాహం జరిగింది. కొంతకాలంగా సంధ్యారాణి, రాంబాబుల మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. భర్త ప్రవర్తన సరిగా లేకపోవడంతో పలుమార్లు భార్య ప్రవర్తన మార్చుకోవాలని చెప్పింది. ఇటీవల కాలంలో భర్త రాంబాబు పలు నేరాల్లో నిందితుడిగా ఉన్నాడు. రెండు రోజుల క్రితమే జైలు నుండి విడుదలయ్యాడు. శనివారం ఉదయం సంధ్యారాణి ఆకివీడు పాత శివాలయం వద్ద పూజలు చేసుకునేందుకు ఆలయానికి వెళ్ళింది. శివాలయం సందులో అప్పటికే వేచి చూస్తున్న రాంబాబు భార్యతో మాట్లాడేందుకు సమీపంలోని ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఆలయానికి వచ్చిన ఆమె బైక్ మీదే వెనక కూర్చుని భర్త రాంబాబు సమీప ప్రాంతంలోనికి తీసుకువెళ్లాడు. ఆ సమయంలో చుట్టుపక్కల వారంతా వారిని చూసినప్పటికీ వారికి ఎటువంటి అనుమానం కలగలేదు. హఠాత్తుగా భర్త రాంబాబు తనతో తెచ్చుకున్న చాకును ఒక్కసారిగా తీసి సంధ్యారాణి మెడ,తలతో పాటు పలుచోట్ల విపరీతంగా పొడిచాడు. క్షణకాలంలో ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైంది. ఆమె కేకలు వేయడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు వచ్చేసరికి రాంబాబు అక్కడి నుంచి ఉడాయించాడు. సంఘటన స్థలం నుంచి పారిపోయి పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. కొన ఊపిరితో ఉన్న సంధ్యారాణి కొద్దిసేపు ప్రాణాలతో సంఘటన ప్రాంతంలో కొట్టుమిట్టాడింది. సంఘటనా స్థలానికి ఆకివీడు ఎస్ఐ సత్యసాయి వచ్చి వివరాలు సేకరించారు. అనంతరం మృతురాలి బంధువులు మృతదేహంతో పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించారు. నిందితుడిని కఠినం గా శిక్షించాలంటూ ఆందోళనకు దిగారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ ఆకివీడు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

### ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికలు

**- 79.20 శాతం పోలింగ్ నమోదు**
**- జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి**

**విశాలాంధ్ర-భీమవరం:** జిల్లాలో ఒక సర్పంచ్, పది వార్డు మెంబర్లు పదవులకు నిర్వహించిన పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, 79.20 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో ఇరగవరం మండలం కావలిపురం, పాలకొల్లు మండలం అగర్తిపాలెం, యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామ పంచాయతీల సర్పంచ్ పదవులకు, 28 వార్డు మెంబర్ పదవులకు పంచాయితీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. నామినేషన్లు ఉపసంహరణ అనంతరం పాలకొల్లు మండలం అగర్తిపాలెం, యలమంచిలి మండలం దొడ్డిపట్ల సర్పంచ్ పదవులకు పోటీ లేకుండా ఏకగ్రీవం కాగా, వార్డు మెంబర్లు పదవుల్లో వీరవాసరం మండలం మెంటేపూడి, ఉండి మండలం కలిసిపూడి, ఆకివీడు మండలం కుప్పనపూడి 2, 7 వార్డులు, అజ్జమూరు, ఇరగవరం మండలం కావలిపురం, పెనుమంట్ర మండలం వెలగలేరు, తణుకు మండలం ముద్దపురం, తాడేపల్లిగూడెం మండలం కృష్ణయ్య పాలెం, వీరంపాలెం, పోడూరు మండలం కొమ్ము చిక్కాల, పాలకొల్లు మండలం వెలివెల, దిగమర్రు, దగ్గులూరు, పెంటపాడు మండలం చింతపల్లి, నరసాపురం మండలం కే.బేతపూడి, తూర్పు తాళ్ల, యలమంచిలి మండలం కాంబోట్ల పాలెం వార్డు పదవులకు ఎన్నిక లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడానికి కృషి చేసిన అధికారులు, పోలీస్ అధికారులు, పోలీసులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో అభినందించారు.

### ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంకు అద్దె భవనం కావలెను

**విశాలాంధ్ర-ఏలూరు:** జిల్లా కేంద్ర గ్రంథాలయం, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయాలకు అద్దె భవనం కావాలని, అద్దెకిచ్చు భవన యజమానులు ఈనెల 31వ తేదీలోగా సంప్రదించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయమునకు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంనకు నూతన భవనం నిర్మించుటకు గాను ప్రస్తుత భవనంలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయం, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయాలను వేరొక చోటకు మార్చవలసియున్నదని, అందువలన ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్ర గ్రంథాలయము, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయాలకు ఏలూరు నగరం నడిబొడ్డులో విశాలమైన 3 హాలులు, 6 గదులు గల భవనం అద్దెకు అవసరమైవుందన్నారు.అద్దెకు ఇచ్చువారు అద్దె అగ్రిమెంట్ చేసుకొనవలసి ఉన్నదని, అద్దెను ప్రభుత్వ నిభంధనలు, రేట్ల ప్రకారం ప్రతీ నెలా చెల్లిస్తామన్నారు. పై షరతులకు ఆమోదించి జిల్లా కేంద్ర గ్రంథాలయం, జిల్లా గ్రంథాలయ సంస్థకు కావలసిన వసతి అద్దెకిచ్చుటకు అంగీకరించు వారు వారి అంగీకారమును ఈ నెల 31 లోపుల పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వారికి లిఖితపూర్వకంగా తెలియపరచాలని శేఖరబాబు ఆ ప్రకటనలో తెలియజేసారు.

### కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించండి

**విశాలాంధ్ర-ఏలూరు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ ఏలూరు సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ పిలుపునిచ్చారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో సిపిఐ బస్సు యాత్ర గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం, ఆర్.ఆర్.పేట, సీపీఐ కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ బస్సు యాత్ర ఈనెల23వ తేదీ బుధవారం ఉదయం ఏలూరు ఆశ్రం హాస్పిటల్ కూడలికి చేరుకుంటుందన్నారు. అక్కడి నుండి ర్యాలీగా అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద గల టొబాకో మార్చంట్స్ కళ్యాణ మండపంలో సిపిఐ ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్ట్ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నుండి ప్రతినిధులు హాజరవుతారని ఈ కార్యక్రమంలో ఏలూరు సిపిఐ పార్టీ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కూరేళ్ల వరప్రసాద్,మావూరి విజయ,అడ్డగర్ల లక్ష్మీ ఇందిర,కొండేటి బేబి, ఎం.ఏ.హకీమ్,భజంత్రీ శ్రీనివాసరావు,శుబేదార్ ఖాన్, బంగారు దుర్గాప్రసాద్, తదితురులు పాల్గొన్నారు.

### జాతీయ సదస్సు సెమినార్‌కు సూర్యనారాయణ మూర్తి ఎంపిక

**విశాలాంధ్ర - తణుకు:** కాశ్మీర్ లో జరుగు జాతీయ సెమినార్ కు దువ్వ సర్పంచ్ అద్దా సూర్య నారాయణ మూర్తి (బాబు) ఎంపిక య్యారు.తణుకు మండలం దువ్వ సర్పంచ్ అడ్డాల బాబు శ్రీనగర్‌లో జరుగు జాతీయ గుడ్ గవర్నెన్స్ మీద జాతీయ సెమినార్‌కు ఆంధ్రప్రదేశ్ నుండి ఎంపిక అయ్యారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ తో పాటు ఈనెల 21 తారీకు నుండి జరుగు మూడు రోజుల సమావేశానికి హాజరవు తున్నారు.ఈనెల 20న ఢిల్లీకి బయలుదేరి అక్కడ నుండి శ్రీనగర్ కు బయలుదేరి వెళ్ళ నున్నారు. దువ్వ గ్రామంలో జరుగుతున్న సుపరిపాలనపై రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి ఇన్స్టిట్యూట్ వారు ఈనెల 9వ తేదీన డాక్యుమెంటరీ కూడా తయారు చేశారు.జాతీయ సదస్సులో దువ్వ సర్పంచ్ అద్దా సూర్య నారాయణ మూర్తి (బాబు )ప్రజెంటేషన్ చేయబోతున్నారు.

### భీమవరంలో ఫ్యాప్టో ధర్నా

**విశాలాంధ్ర-భీమవరం:** ఫ్యాప్టో దశలవారీ పోరాటంలో భాగంగా పశ్చిమగోదావరి కలెక్టరేట్ వద్ద జిల్లా ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేయాలని నూతన విద్యా సంస్కరణలను రద్దు చేయాలని, జీఓ నెంబర్ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపల్ విద్యాశాఖ అధికారి ప్రవీణ్ ప్రకాష్ వైఖరి దారుణంగా ఉందని ఆయన విమర్శించారు. బదిలీలు ప్రమోషన్లలో వెళ్లిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు విధించవద్దని, ఆన్‌లైన్ పనులకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ బీ.హెచ్.జవహర్ లాల్ రాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ఎస్.విజయరామరాజు, ఏకేవీ రామభద్రం, ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.రామ చంద్రరావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బి.వి.నారాయణ, ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షులు రమణ, డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, బిటిఏ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు, సిపిఎస్ సంఘం జిల్లా అధ్యక్షులు వీరవల్లి వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు జె ఎన్ వి గోపాలన్, మహిళా నాయకులు బాలా కుమారి, కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ బస్సు యాత్రను జయప్రదం చేయండి

**విశాలాంధ్ర-కొయ్యలగూడెం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార జాత బస్సుయాత్రను విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలో తిమ్మనకుంట గ్రామంలో శనివారం సిపిఐ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి దాగాని వెంకటేశ్వరరావు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. సిపిఐ ఆధ్వర్యంలో బస్సు జాతయాత్ర నిర్వహిస్తున్నారని ఈనెల 23వ తేదీన మధ్యాహ్నం గం.3లకు జంగారెడ్డిగూడెం పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని, ఈ సభకు జిల్లా నాయకులు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నందున మండలంలో ఉన్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మద్దాల దుర్గారావు, చొక్కా ఆలీసమ్మ చొక్కా బాలస్వామి, వెల్లుపోం సుబ్బలక్ష్మి, కె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జనరంజక పాలన

**విశాలాంధ్ర-కొయ్యలగూడెం :** పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలకు నేరుగా లబ్ధి చేకూరే విధంగా ముఖ్యమంత్రి జగన్ జన రంజక పాలన చేస్తున్నారని పోలవరం శాసన సభ్యులు తెల్లం బాలరాజు పేర్కొన్నారు. గృహ సారథులు, కన్వీనర్ లతో పోలవరం నియోజకవర్గ స్థాయి జేసీఎస్ నమోదు శిబిరం కొయ్యలగూడెం మండలం సచివాలయల కోఆర్డినేటర్ నూకల రాము అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన తెల్లం బాలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు అనేక విధాలుగా బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి గృహ సారధులకు, కన్వీనర్లకు బీమా కార్డులను బాలరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు గంజిమల రామారావు, పోలవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరేటి శాంత కుమారి సత్యనారాయణ, వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాచార సాంకేతిక ప్రయోగశాల ప్రారంభం

**విశాలాంధ్ర-కొయ్యలగూడెం:** శ్రీవెంకటపతి రాజు ఎడ్యుకేషనల్ సొసైటీలో భాగంగా ఉన్న సాయి రాకేష్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ గవర వరంలో సమాచార సాంకేతిక కంప్యూ టర్స్ ప్రయోగశాలను శనివారం ఎడ్యుకేషనల్ సోసైటీ చైర్ పర్సన్ ఎస్ ఆర్ ఆర్ బి సుభద్ర దేవి, ఎస్ ఆర్ఆర్‌విబిఏ నరసింహారాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలలో పుస్తక పఠననైపుణ్యంతో పాటు ప్రయోగాత్మక సృజనా త్మకత అభివృద్ధి పరచుటకు ఆధునికరించబడిన సైన్స్, గణిత, సమాచార సాంకేతిక కంప్యూటర్స్ ,ప్రయోగశాలల ఎంతగానో ఉపయోగపడుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, జీవీ లక్ష్మీ శ్రీనివాస్, సైన్స్ అండ్ మాథ్స్, కంప్యూటర్ అండ్ టెక్నాలజీ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల కడుపు కొట్టిన ముఖ్యమంత్రి జగన్

**విశాలాంధ్ర-తణుకు:** పట్టణంలోని అన్న క్యాంటీన్ మూసివేసి ముఖ్యమంత్రి జగన్ పేదల కడుపు కొట్టారని మాజీ శాసన సభ్యులు, తెదేపా తణుకు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శిం చారు. శనివారం పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో పేదలకు స్వయంగా ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ స్వయంగా పేదలకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబు సంకల్పించిన అన్నా క్యాంటీన్‌లు గత ప్రభు త్వంలో ఎంతోమంది పేదలకు ఆకలి తీర్చిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న కాంటీన్‌లను మూసివేసి పేదల కడుపు కొట్టిన తరుణంలో టిడిపి ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ లను నిర్వహిస్తున్నామన్నారు. శనివారం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ కు అమెరికాలో ఉన్నటువంటి శ్రావణి, హర్ష వివాహ వార్షికోత్సవ సందర్భంగా శ్రావణి తండ్రి రాంబ్రహ్మం పేదల కొరకు ఉచితంగా అన్నదానం చేసినందుకు వారికి ధన్య వాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ ప్రధాన కార్యదర్శి, దాత జాస్తి రాంబ్రహ్మం చౌదరి, సుబ్బారావు, తాతపూడి మారుతీరావు, మళ్లిన రాధాకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ ఫోటోగ్రాఫర్స్ డే వేడుకలు

**విశాలాంధ్ర-భీమడోలు:** వరల్డ్ ఫోటోగ్రఫీ డే సందర్భంగా భీమడోలు సర్కిల్ ఫోటోగ్రాఫర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఫోటోగ్రఫీడే వేడుకలు ఘనంగా జరిగాయి. భీమడోలు సంత మార్కెట్ వద్దనున్న డాగూరే,కలామ్ వేదిక వద్ద ఫోటోగ్రఫీ సృష్టికర్త డాగూరే, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఫోటోగ్రాఫర్స్ సంఘం నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు శ్రీరామ్, గౌరవాధ్యక్షులు బ్రహ్మారావు మాట్లాడుతూ ప్రతిఒక్క ఫోటోగ్రాఫర్ కు ఈరోజు పండుగ రోజని, నేడు ఫోటోగ్రాఫర్స్ ప్రతిఒక్కరు ఫోటోగ్రఫీ ఆద్యులు డాగురే ని స్మరించుకోవా లన్నారు. ఫోటోగ్రాఫర్స్ అందరు ఐక్యమత్యంగా మెలగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భీమడోలు సర్కిల్ ఫోటోగ్రాఫర్స్ సంఘ అధ్యక్షులు ద్రాక్షారపు శ్రీరామ్, గౌరవ అధ్యక్షులు పిల్లి బ్రహ్మారావు, అలజంగి రంగారావు, ఫోటో గ్రాఫర్స్ సంఘ జిల్లా ట్రెజరర్ పుల్లాభోట్ల రామ్మూర్తి, సంఘ సభ్యులు నరేష్, నాగరాజు, చిన్ని దుర్గేష్, సాయి, ప్రతాప్, రాంబాబు, సురేష్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**విశాలాంధ్ర -ఏలూరు:** సింధు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఎస్‌సిటి దంత వైద్యశాల, ఓల్డ్ ఎస్‌బిఐ బజార్ బ్రాంచ్ బిల్డింగ్ ఆవరణలో నిర్వహించారు. 72 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కళ్ళజోళ్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమం సింధు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జి. సింధూర ఆధ్వర్యంలో వై .భాను ప్రసాద్, మూడెడ్ల శైలజ, రాచమళ్ళ శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో నిర్వహించారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రాఫర్ దినోత్సవ వేడుకలు

**విశాలాంధ్ర -కైకలూరు :** కైకలూరు ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు ప్రపంచ ఫోటోగ్రాఫర్ దినోత్సవ వేడుకను డాగురె విగ్రహం వద్ద నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించి అనంతరం సీనియర్ ఫోటోగ్రాఫర్స్‌కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు ప్రెసిడెంట్ పి.సాగర్ బాబు తెలుపారు. అనంతరం సీనియర్ ఫోటోగ్రాఫర్ జాషువాకు సర్కారం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్స్ టి.ఎన్ ఆచారి,కసగాల సుమంత్,తది తరులు పాల్గొన్నారు.

## మారుజాతి అడవులను పరిశీలించిన ఫ్లయింగ్ స్క్వాడ్

**విశాలాంధ్ర-జీలుగుమిల్లి:** మారుజాతి మొక్కలు పెరుగుదల బావుందని వైజాగ్ ఫ్లైయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ గంగ రాజు అన్నారు. శనివారం మండలం లోని పి. రాజవరం, కామయ్యపాలెం మారుజాతి అడుగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల సంరక్షణ సక్రమంగానే ఉందని సిబ్బందిని అభినందించారు. పరిశీలించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఎఫ్ఆర్ఓ శ్రీవాణి, జీలుగుమిల్లి గార్డు పరమేష్ ,తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## రూపాలను జ్ఞాపకంగా ఉంచేది ఫోటోగ్రఫీ

**విశాలాంధ్ర-ఆకివీడు :** ఎన్నో విలువైన రూపాలను ఇప్పటికీ, ఎప్పటికీ,ఏనాటికి జ్ఞాపకంగా ఉంచేది ఫోటోగ్రఫీ అని ఆకివీడు ఫోటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శాలానంద అన్నారు. శనివారం ఆకివీడు స్టేషన్ రోడ్ లో గల బేబీ షూట్ స్టూడియోలో184వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ఆకివీడు ఫోటోగ్రాఫర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 14 వ వార్డు కౌన్సిలర్ గేదెల అప్పారావు మాట్లాడుతూ ఎన్నో విలువైన జ్ఞాపకాలను మన కళ్ళ ముందు ఉంచేది ఫోటోగ్రఫీ అని అన్నారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాకస్ మండే దాగ్యూరె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సీనియర్ ఫోటోగ్రాఫర్లను సన్మానించారు . ఈ కార్యక్రమంలో బండారు నరసింహారావు, మానుకొండ నోబుల్, కట్టా కళ్యాణ్, ఉన్నం ప్రసాద్ బాబు, జోగి ఉదయ్ శంకర్, కట్టా అంజి, గౌస్, రమేష్, బండారు ఆదిత్య, రాము తదితరులు పాల్గొన్నారు.

# రాజీయే రాజ మార్గం

**విశాలాంధ్ర -భీమవరం:** ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు, పశ్చిగోదావరిజిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్, భీమవరం మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్ పర్సన్ పి. శ్రీ సత్యాదేవి సూచనలతో భీమవరం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో సెప్టెంబర్ 9వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులందరు సద్వినియోగం చేసుకోవాలని భీమవరం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.సురేష్ బాబు కోరారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోర్టులో కేసులు నడిపించుకుంటే ఇరు పార్టీల్లో ఒకరు గెలవడం ఒకరు ఓడిపోవడం జరుగుతుందని అదే లోక్ అదాలత్ లో ఇరువురు గెలిచినట్లేనని తెలిపారు. కక్షిదారులు రాజీ మార్గాన్ని ఎంచుకుంటే వారి సమయం, ధనము వృధా కాకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో భీమవరం రూరల్ సిఐ నాగప్రసాద్, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవుల జీవితంతో విడరాని బంధం ఫోటోగ్రఫీ

**విశాలాంధ్ర - కలిదిండి:** ప్రస్తుత ప్రపంచంలో ఫోటోగ్రఫీ మానవుల జీవితంతో విడరాని బంధం ఏర్పడిందని కలిదిండి మండల ఫోటోగ్రాఫర్స్ సంఘం అధ్యక్షులు ఎస్.వి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక మార్కెటింగ్ యార్డులో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రఫీ ఆద్యుడైన లూయిస్ జాక్విన్ మ్యాండి డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చరిత్రకు సాక్ష్యంగా గతాన్ని గుర్తు చేసే ఆనందంతో పాటు ఆహ్లాదాన్ని ఫోటోలు అందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కె. విక్టర్ బాబు, ఉపాధ్యక్షులు డి. వీర్రాజు, కోశాధికారి పి. దుర్గారావు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన విద్యనభ్యసించాలి

**విశాలాంధ్ర -భీమవరం:** సమాజంలో మానవ విలువలు ఎంతో ఉన్నతమైనవని వాటిని విద్యార్థులు తమ జీవితంలో భాగం చేసుకోవాలని నన్నయ్య యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కమల కుమారి అన్నారు. శనివారం బి.వి.రాజు కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం అధ్వర్యంలో మానవతా విలువలపై జరిగిన సదస్సులో ఆమె కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యనభ్యసించి జీవితం ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.ఆర్. కృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపాల్ సి.హెచ్. సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రావిచర్లలో మన మట్టి -మన దేశం

**విశాలాంధ్ర -నూజివీడు :** నూజివీడు మండలంలోని రావిచర్ల గ్రామంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా మన మట్టి -మన దేశం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మొదటగా సచివాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, దేశభక్తి గీతాలు ఆలపించారు. ఎన్ ఎస్ ఎస్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ విద్యార్థులు సిబ్బందితో గ్రామపంచాయతీ స్థాయి, రక్షణ సిబ్బందికి సన్మానం చేయించి అనంతరం పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో 150 మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టినట్లు తెలిపారు. ముందు తరాలకు హరితవనాలను అందించవలసిన బాధ్యత నేటి తరం పై ఉందన్నారు.

## ఆర్థిక స్తోమత లేని కక్షిదారులకు ఉచిత న్యాయం

**విశాలాంధ్ర -చింతలపూడి :** న్యాయవాదుని నియమించుకునే ఆర్థిక స్తోమత లేని వారికి, శిక్ష పడిన ముద్దాయిలు వారి కేసులు పై కోర్టులో అపీలు చేసుకొనుటకు తగిన ఆర్థిక స్తోమత లేకపోతే కోర్టు ద్వారా ఉచిత న్యాయం ద్వారా న్యాయవాదని ఏర్పాటు చేస్తారని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు తెలిపారు. శనివారం స్థానిక సబ్ జైలును మండల న్యాయ సేవల కమిటీ సందర్శించింది. ముద్దాయిలకు అందుతున్న ఆహార, వసతి, వైద్య సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ ముద్దాయిలు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకొని కష్టపడే తత్వం అలవాటు చేసుకుని జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు పర్యవేక్షకులు గోలి వెంకటేశ్వరరావు,న్యాయవాదులు బల్లా ఏసు పాదం, జైలు పారా లీగల్ వాలంటీర్స్ అక్బర్ ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ ద్వారా గర్భవతులకు స్కానింగ్

**విశాలాంధ్ర -భీమవరం టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ నుండి ఐదు నెలలు నిండిన ప్రతి గర్భిణీలకు స్కానింగ్ నిమిత్తం రూ.1100 విడుదల చేసిందని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డి. మహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కానింగ్ ద్వారా తల్లి గర్భంలో ఉన్న బిడ్డ అవయవాల పనితీరు,లోపాలు, స్థితి ముందుగానే తెలుసుకునే వీలుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆరోగ్యశ్రీ అనుమతి పొందిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో వినియోగించుకునే అవకాశం ఉందని, కావున ప్రతి గర్భిణీ స్త్రీ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు.

## 18 ఏళ్ళు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలి

**విశాలాంధ్ర-టి నరసాపురం:** 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని జంగారెడ్డి గూడెం ఆర్‌డిఓ ఝాన్సీ రాణి తెలిపారు. బొర్రంపాలెం సచివాలయం 1ను సందర్శించి ఓటర్ల జాబితాను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఎల్ఓ లు ప్రతి ఇంటికి వెళ్ళి ఓటర్ల వివరాలు తెలుసుకోవాలని ఆమె తెలిపారు. 18 ఏళ్ళు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించి మరణించిన వారి పేర్లు ఓటర్ల జాబితా నుండి తొలగించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జె. సుబ్బారావు, పంచాయతీల విస్తరణ అధికారి రామకృష్ణ, వీఆర్వో సుబ్బారావు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మోనో క్రోమ్ ఛాయాచిత్రం అవార్డు అందుకున్న ఫోటోగ్రాఫర్ సలాది కృష్ణ

**విశాలాంధ్ర - ప్రత్తిపాడు :** ప్రపంచఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫోటోగ్రఫీ అకాడమీ వారు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి నిర్వహించిన ఫోటో కాంపిటీషన్‌లో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు చెందిన ఈశ్వర్ స్టూడియో అధినేత సలాది కృష్ణ తీసిన మార్నింగ్ డ్యూటీ అనే మోనోక్రోమ్ ఛాయా చిత్రం అవార్డు కి ఎంపికైన సందర్భంగా శనివారం విజయవాడ పింగళి వెంకయ్య రోటరీ ప్లాటినం జూబ్లీ సెంటర్ అడిటోరియంలో అవార్డ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు సమక్షంలో ఫోటోగ్రాఫర్ సలాది కృష్ణ అవార్డు అందజేశారు

## ఘనంగా సురేష్ పుట్టినరోజు వేడుకలు

**విశాలాంధ్ర - ముమ్మిడివరం :** మాదిగ రాజకీయ పోరాట సమితి యువసేన రాష్ట్ర అధ్యక్షులు బొమ్మి సురేష్ జన్మదిన వేడుకలు ముమ్మిడివరం సమైక్యఆంధ్ర శిబిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాదిగ రాజకీయ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు ఆకుమర్తి చిన్న మాదిగ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం బొమ్మి సురేష్ మాట్లాడుతూ మాదిగలకు రావలసిన సమాన హక్కుల కోసం, వర్గీకరణ కోసం మాదిగ రాజకీయ పోరాట సమితి ఆధ్వర్యంలో సంఘాల కతీతంగా పార్టీలకతీతంగా మాదిగలకు ఎలాంటి అవసరం వచ్చినా జాతీయ అధ్యక్షులు ఆకుమర్తి చిన్న మాదిగ ఆదేశాల మేరకు పనిచేస్తానని, భవిష్యత్తులో విజయ వాడలో జరగబోయే సభను జయప్రదం చేయడం కోసం గ్రామ గ్రామాన పర్యటించి నూతన నిర్మాణం చేపట్టి ఉద్యమాన్ని బలోపేతం చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సవరపు వెంకటేష్, ఆకుమర్తి విజయ్ కుమార్, సత్తాలకృష్ణ, జొన్నడ అజయ్, శ్రావణ్ కుమార్, పెదపూడి గోపాలకృష్ణ, ముమ్మిడివరపు శివప్రసాద్, దిగుమర్తి శివప్రసాద్, చుట్టుగుళ్ళ వెంకటేష్, లంక కేశవ్, లంక దుర్గారావు, ముమ్మిడివరపు దేవేంద్ర, ఆర్ సురేష్ కుమార్, పెదపూడి చంటి తదితరులు పాల్గొన్నారు.

## సుందరమ్మ సత్రం భూములు వేలం పాట నిర్వహించాలి

**విశాలాంధ్ర - గోకవరం :** 37 ఎకరాల సుందరమ్మ సత్రం భూములు వేలంపాటలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గోకవరం మండలం, రంప ఎర్రం పాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ఆర్ సి ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ఎండోమెంట్ అధికారులు, మరియు తాసిల్దార్, పోలీసులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో జరిగిన వేలం పాటలో 21 ఎకరాల భూమిని పాడుకున్నవారు డబ్బులు కట్టకుండా రాజకీయ ఒత్తిడితో పైరవీలు చేసుకుని ఆ భూములను విడిచిపెట్టడంలేదని అన్నారు. రూల్ ప్రకారంగా పాట పాడుకున్న రోజునే ఒక సంవత్సరం డబ్బులు ముందుగా చెల్లించవలసి ఉండగా కొంతమంది 21 ఎకరాల భూమికి శిస్తు చెల్లించకుండా వెళ్లిపోయారని, ఆ భూములకు తిరిగి వేలంపాటలు నిర్వహించడంలో ఎండోమెంట్ అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో గుడిసె చెల్లారావు,గోలి మూసలయ్య కడవల అప్పారావు,వడ్లపాటి వెంకటలక్ష్మి, డివిజన్ కార్యదర్శి సురేష్, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాసాని జన్మదిన వేడుకలు

**విశాలాంధ్ర - రాజానగరం :** మనపార్టీ వ్యవస్థాపకులు 93 బీసీ కులాల ఐక్యవేదిక రథసారథి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ జన్మదిన వేడుకల్ని 93 బిసి కులాల ఐక్యవేదిక యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.మాజీ ఎమ్మెల్సీ తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులైన కాసాని జ్ఞానేశ్వర్ 69వ జనదిన వేడుకల్ని పురస్కరించుకొని మండలకేంద్రమైన రాజానగరంలో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు, సిబ్బందికి పండ్లు,తీపి మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే కేకు కోసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునసా అప్పారావు మాట్లాడుతూ 93 బిసి కులాలను ఏకతాటిపై నడిపిస్తున్నారని చెప్పారు కాసాని జన్మదిన వేడుకలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కర్రి శ్రీనువాస్,జిల్లా ఉపాధ్యక్షులు మర్గాని శ్రీనివాస్,సర్పంచ్ తంగెళ్ళ ముసలయ్య,తంగెళ్ల వీరాస్వామి,బుర్ర ముత్యాలు,కోడి రమణ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జిల్లా స్థాయి యోగాసన పోటీలు

**విశాలాంధ్ర - నిడదవోలు :** రోటరీక్లబ్ నిడదవోలు, జిల్లా యోగా అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి యోగసన పోటీలు శనివారం ముగిసాయి. ముగింపు సభకు రోటరిక్లబ్ అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ బాల్యం నుండే మన మనస్సుపైన, శరీరం పైన పట్టు కలిగి ఉన్నప్పుడే ఆరోగ్య వంతమైన జీవనం గడపవచ్చునని అందుకు యోగ దోహదపడు తుందన్నారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు సి హెచ్ ఆర్ కే వర్మ మాట్లాడు తూ వివిధ కేటగిరీలో సెలెక్ట్ అయిన క్రీడాకారులు వచ్చే నెల 9,10 తేదీలలో కర్నూల్ లో జరుగు 48వ రాష్ట్రస్థాయి యోగ పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కార్యదర్శి ఎస్. చంద్రశేఖర్, రోటరీ క్లబ్ కోశాధికారి కాళ్ళ రాంబాబు, ఎస్.వి. సుబ్బా రావు యోగ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలకు బహు మతులు, ప్రశంసా పత్రాలు అందచేశారు.

## విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకోవాలి

**విశాలాంధ్ర - గణపవరం:** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని గణపవరం తహసీల్దార్ పీవీఎస్ఎస్ఎన్ లక్ష్మి అన్నారు. శనివారం గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి అధ్యక్షత వహించారు. తహసిల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి, వాటి విలువలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపక ఇతర సిబ్బంది, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గోపికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## త్వరలో జెఎన్‌టియుకెలో "ఎసిసిఇ" స్టూడెంట్ సెంటర్ ఏర్పాటు

**విశాలాంధ్ర - కాకినాడ :** సివిల్ ఇంజనీర్ల నైపుణ్యాభివృద్ధితో పాటు సాంకేతిక అవగాహన పెంచడంలో అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ (ఇండియా) (ఎసిసిఇ(ఐ) ఎంతో కృషిచేస్తోందని జవర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ప్రసాదరాజు అన్నారు. వర్సిటీ సివిల్ ఇంజనీర్ విద్యార్థులకు అవసరమైన అవగాహనా కార్యక్రమాల నిర్వహణతోపాటు సాంకేతిక చర్చలు, భవిష్య త్తులో ఉద్యోగ ఉపాధికల్పనకు దోహదపడే ఎసిసిఇ (ఐ) స్టూడెంట్ సెంటర్ ఏర్పాటుకు త్వరలో నిర్ణయం తీసుకుంటామని విసి అన్నారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ (ఇండియా) కాకినాడ చాప్టర్ తృతీయ వార్షికోత్సవ వేడుకలను స్థానిక జిఆర్‌టి గ్రాంట్‌లో ఘనంగా నిర్వహించారు. విసి జ్యోతి ప్రజ్వలనం చేసి లాంఛనంగా ప్రారంభించారు. సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సివిల్ ఇంజనీర్ల నైపుణ్యం అభివృద్ధిచేసే దిశగా ఈ సంస్థ ఎంతో కృషిచేస్తోందని కాకినాడ వంటి అభివృద్ధి చెందుతున్న నగరానికి సివిల్ ఇంజనీర్ల సహాయ సహకారాలు ఎంతో అవసరమని గుర్తుచేసారు. కాకినాడ చాప్టర్ చైర్మన్ బాదం సుందరరావు మాట్లాడుతూ సాంకేతిక విలువల అభివృద్ధి, సివిల్ ఇంజనీర్లు, నిర్మాణ రంగ కార్మికులు, నిర్మాణరంగం ప్రధాన ఆశయాలను నిలబెట్టే విధంగా నిర్విరామంగా కృషిచేస్తున్నామని చెప్పారు. జెఎన్‌టియుకె వైస్ చాన్సలర్ డాక్టర్ ప్రసాదరాజును బాదం సుందరరావు, దురా ప్రసాద్‌లు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసారు. ఎమ్‌సి మెంబర్స్ ప్రొఫెసర్ వి రవీంద్ర, ఇంజనీర్ టిబి శ్రీనివాస్, ఇంజనీర్ స్వప్నసాధ చంద్రశేఖర్, ఇంజనీర్ వై సుబ్రహ్మణ్యం, విజయ కృష్ణ, రాంబాబు, రామకృష్ణ, నాగేశ్వరరావు, సూరాడ దుర్గాప్రసాద్, ఎవిఎస్ రాజ, ఎల్‌వీస్ సుబ్రహ్మణ్యం, శ్రీహరి, సాయిరామ్, మురళి కృష్ణ, అడపా శ్రీనివాస్, జెఎన్‌టియు సివిల్ విభాధిపతి ప్రొఫెసర్ కోటేశ్వరరావుతో పాటు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

## ఉద్యోగమేళాలో 15 మంది ఎంపిక

**విశాలాంధ్ర- రాజమహేంద్రవరం రూరల్ :** జిల్లా కలెక్టరేట్‌లోని వికాస వారి ఆధ్వర్యంలో, శనివారం జరిగిన జాబ్ మేళాకు 35 మంది హాజరయ్యారని జిల్లా కలెక్టర్ కె. మాధవీలత తెలియచేశారు. శనివారం కలెక్టరేట్ నిర్వహించిన ఉద్యోగమేళాలో 15 మంది ఎంపికైనట్లు ఆమె తెలిపారు. నాగు ఇన్ఫోటెక్ 3, ఆదిత్య ఇంజనీరింగ్ సర్వీసెస్ 3, డిక్సన్ కు 9 ఎంపికయ్యారని మాధవీలత తెలిపారు. వికాస మేనేజర్ సత్యనారాయణ, ఆయా కంపెనీల ప్రతినిధులు, పలువురు నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారు.

## హెచ్‌పి గ్యాస్ ఉచిత సేవా శిబిరం

**విశాలాంధ్ర-నూజివీడు:** హెచ్‌పి గ్యాస్ ఉచిత సేవా శిబిరాన్ని నూజివీడు లక్ష్మీ ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అన్నవరంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది గ్యాస్ వినియోగంపై గ్రామస్థులకు అవగాహన కల్పించడంతో పాటు గ్యాస్ వినియోగానికి కావలసిన గృహోపకరణాలను విక్రయించడంతో పాటు నూతన గ్యాస్ కనెక్షన్‌లను అందించారు.

## సెల్ టవర్ పెడితే ఊరుకోం

**విశాలాంధ్ర - మండపేట :** నివాస ప్రాంతాల మధ్య సెల్ టవర్ నిర్మిస్తే చూస్తూ ఊరుకునేది లేదని 16వ వార్డు కౌన్సిలర్ మెండు బాపిరాజు హెచ్చరిం చారు. గొల్లపుంత రోడ్డు పాత బ్రాందీ షాపు సమీపంలో ఉన్న వీధిలో ఓ ప్రముఖ సెల్ కంపెనీకి సంబంధించిన సిగ్నల్ వ్యవస్థ కోసం టవర్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న స్థానికులు మా వీధిలో సెల్ టవర్ నిర్మించడం కుదరదని అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ బాపిరాజు టవర్ నిర్మించే స్థలం వద్ద శనివారం స్థానికులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ సిద్దిరెడ్డి రామకృష్ణతో కలిసి బాపిరాజు మీడియాతో మాట్లాడారు. జనావాసాల మధ్య టవర్ నిర్మించడం కుదరదన్నారు. దీనివల్ల భవిష్యత్తులో అనేక ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. దీనిపై కమిషనర్ రామ్ కుమార్‌కు వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. మున్సిపాలిటీ అనుమతి ఇచ్చే ముందు స్థానికుల అభిప్రాయాలు సేకరించాలని అన్నారు. స్థానికుల ఒప్పందం మేరకే మున్సిపల్ అధికారులు టవర్ అనుమతులు ఇవ్వాలని లేని పక్షంలో తాము ఆందోళనను ఉధృతం చేసి అడ్డుకుంటా మని హెచ్చరించారు. జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయడానికి సిద్దంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో గండి కొండయ్య, గనిశెట్టి సూరిబాబు, కంతంశెట్టి మల్లేశ్, స్థానికులు పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడు బొడ్డుకు మాతృ వియోగం

**విశాలాంధ్ర - సామర్లకోట :** సామర్లకోట సీనియర్ పాత్రికేయులు బొడ్డు రామారావుకు మాతృ వియోగం కలిగింది. రామారావు తల్లి అయిన బొడ్డు సూరుడు (77) స్వల్ప అనారోగ్యంతో సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆమె మృతి చెందారు. ఆమె మృతితో కుటుంబీకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సామర్లకోట మండల శ్రీ భీమేశ్వర జర్నలిస్ట్స్ అసోసియేషన్ నాయకులు, మండల పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు, కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ, అసోసియేషన్ నాయకులు అడపా వెంకటరావు, అలమండ రంగనాథ స్వామి, పెమ్మాడి వీరభద్రరావు, నూతాటి అశోక్, అందుగుల వీర్రాజు, అడపా శ్రీనివాస్, పాలిమాటి విజయ్ కుమార్, పచ్చాకుల రాజు, జి రవిబాబు, పలువురు ప్రజా ప్రతినిదులు పార్థీవ దేహానికి నివాళులర్పించిన రామరావు కుటుంబానికి సంతాపాన్ని తెలిపారు.

## సీతారాంపురం కృష్ణాపురం గ్రామాలలో మహాశక్తి ప్రచారం

**విశాలాంధ్ర - జగ్గంపేట :** మండలంలోని సీతారామపురం, కృష్ణాపురం గ్రామాల్లో శనివారం మహాశక్తి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రంలు మహిళలతో కలసి పాల్గొని రెండు గ్రామాలలో పర్యటించారు. చంద్రబాబు ప్రకటించిన భవిష్యత్తు గ్యారంటీ, మహాశక్తి పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి ప్రచారం చేశారు. మహిళా శక్తితోనే రాష్ట్ర రాజకీయాలలో పెనుమార్పు రాబోతుందని తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించబోతుందని అప్పలరాజు అన్నారు.

## రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడిగా వేమా

**విశాలాంధ్ర - రాజోలు :** రాష్ట్ర బిజేపి ఉపాధ్యక్షుడిగా నగరం మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా రెండవ సారి ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బిజేపి అధ్యక్షురాలు పురంధేశ్వరి నుండి ఉత్తర్వులు అందాయని వేమా శనివారం రాజోలు లో తెలిపారు. వేమా గతంలో మూడు పర్యాయాలు రాష్ట్ర కార్యదర్శిగాను, దళిత మోర్చా జాతీయ, రాష్ట్ర కార్యదర్శిగాను, జాతీయ మండలి సభ్యునిగాను సేవలందిం చారు. ప్రస్తుతం వేమా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన రాజోలు మండల బిజేపి కార్యదర్శిగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ఎమ్మెల్యేగా, శాసనసభలో బిజేపి పక్ష ఉపనాయకుడిగా కోనసీమ తోపాటు రాష్ట్ర సమస్యలపై శాసనసభలో తన గళం వినిపించి పలు సమస్యలను పరిష్కరించారు.

## ఖైదీలలో సత్ప్రవర్తన రావాలి

**విశాలాంధ్ర -కైకలూరు :** జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలలో సత్ప్రవర్తన రావాలని సీనియర్ సివిల్ జడ్జి జి షణ్ముఖరావు సూచించారు.సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం ఆయన సబ్ జైల్ విజిట్ చేశారు.దీనిలో భాగంగా ఖైదీలు ఏఏ నేరాల్లో జైలుకు వచ్చారో అడిగి తెలుసుకుని పరివర్తన రాకపోతే జీవితం అంధకారం అవుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడెం వీర వెంకట సత్యనారాయణ వైస్ ప్రెసిడెంట్ ఎం ఎస్ ఎస్ రాజు జాయింట్ సెక్రెటరీ చావలి శంకర్ శాస్త్రి సీనియర్ న్యాయవాదులు అడ్డగర్ల రాంబాబు, దేవరపల్లి శివప్రసాద్ దేవేంద్ర సబ్ జైల్ సూపరింటెండెంట్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.